# అల్లుడొచ్చాడు

-ఎం.వీరేశ్వరరావు

రాఘవరావుగారికి బోలెడు ఆస్తి ఉంది. వారికి ఒక్క కూతురు నమ్రత. నమ్రతకి ఈ మధ్యే పెళ్లయింది. రాఘవరావుగారి అల్లుడి పేరు ముకుందం. సంక్రాంతి పండుగకి ముకుందం మామగారింటికి వచ్చాడు. రాఘవరావు అల్లుడికి ఘనంగా పండుగ జరిపి బట్టలు, కానుకలు ఇచ్చాడు.

సంక్రాంతి పండుగకి వచ్చిన అల్లుడు శివరాత్రి పండుగ వరకు వెళ్లలేదు. కొత్త మోజు అని సరిపెట్టుకున్నాడు రాఘవరావు. మార్చి నెలలో కూడా ముకుందం రాఘవరావు ఇంట్లోనే ఉన్నాడు.

"పండుగలు అయ్యాయి. తమరు ఉద్యోగానికి..'' అడిగాడు రాఘవరావు.

"భలేవారే! పండుగలు ఎక్కడ అయ్యాయి? మాసశివరాత్రి ఉంది. మహావీరజయంతి ఉంది. యాజ్ఞవల్క్య జయంతి ఉంది. చంద్రదర్శనం ఉంది. ఇవన్నీ పండుగలు కావా? వాటన్నింటికీ నేను ఉండొద్దా?''

"అంటే కేలండర్‌లో ఉన్న పండుగలన్నింటికీ అత్తవారింట్లో ఉంటారా?''

'అంతేకదా మరి. లేకపోతే బయటకి వెళ్తే ఖర్చు. ఇక్కడైతే మామగారి మీద వాలిపోవచ్చు' అని మనస్సులో అనుకున్నాడు ముకుందం.

"మరి మీరు ఇక్కడ ఉంటే మీ స్కూలు ఉద్యోగం ఎవరు చేస్తారు అల్లుడుగారూ?'' అడిగాడు రాఘవరావు.

"అదా నేను స్కూలు హెడ్‌మాస్టర్‌తో చెప్పి మేనేజ్ చేస్తాలెండి. మీరు వర్రీకాకండి'' అన్నాడు ముకుందం.

ముకుందం ధోరణి రాఘవరావుకి అర్థం కాలేదు.

"అసలు మా బావ కూడా నా టైపేనండి. పరశురామ్ జయంతి అయినా సరే మా అక్కతోవచ్చి మా ఇంట్లో ఉండి నాతో పేక ఆడి ఎలా కలసిపోయేవాడో'' అంటూ రెచ్చిపోయి చెబుతున్నాడు ముకుందం.

"అవును. అతను కూడా నీలాగే బేవార్స్ కేస్ అయి ఉంటుంది. బావా, బావమరిదిల మధ్య పోలిక ఉండడం ఇదే మొదటిసారి చూస్తున్నా! హు...'' అంటూ గొణిగాడు రాఘవరావు.

"ఏదో అంటున్నారు మామగారు?''

"ఏం లేదు నాయనా! తెలుగు క్యాలెండర్ ఇంట్లో ఎందుకు ఉందా అని ఆలోచిస్తున్నా''.

***

ముకుందం భోజనప్రియుడు. అవలీలగా కప్పు నెయ్యితో ఇరవై బొబ్బట్లు లాగించగలడు. ఇడ్లీలు ఇరవై పొద్దున్నే కావాలి. పెరుగు వడలు ఒక పది. మామూలు వడలు ఒక పాతిక కావాలి పర్వదినాల్లో. పాయసం ఒక బాల్చీ. బకాసురుడి కజిన్ అనిపిస్తాడు.

ముకుందం పిసినారి. పెళ్లం పూలకి ఒక్క రెండు రూపాయలు కూడా ఇవ్వడం లేదు. పూలకి కూడా నాన్నని అడగాలంటే సిగ్గుగా ఉంటోంది నమ్రతకి.

ముకుందం వంటలకి, పిండివంటలకి, టిఫిన్లకి చాకిరీతో అత్తగారు సతమతమైపోతోంది. ఇంకా కొన్నాళ్లు అల్లుడు ఇంట్లో ఉంటే కాశీకి పోతానని రాఘవరావుని బెదిరించింది.

అల్లుడి సమస్యని ఎలా పరిష్కరించాలా అని ఆలోచనలో పడ్డాడు రాఘవరావు.

***

భోజనాల సమయంలో అడిగాడు రాఘవరావు.

"ఈ రోజు ఏం పండగ బాబూ?''

"అదా మామగారు. వృశ్చిక సంక్రమణం''

'సందర్భానికి తగిన పండుగ. తేలులా మమ్మల్ని కుడుతున్నావుగా. ఇదే జరుపుకోవాలి' గొణిగాడు రాఘవరావు.

"ఏదో అంటున్నారు.''

"ఏం లేదు. కొంచెం ఉప్పు ఎక్కువ అయ్యిందంటున్నా. తమరు పీకల దాకా మెక్కండి. నేనిలా చింతకాయ పచ్చడితో సర్దుకుంటా.''

***

"అంటే నీ అల్లుడిని ఇంట్లోంచి పంపించాలి. అతనంతట అతను వెళ్లేలా చేయాలి. అంతేకదా'' అన్నాడు రాఘవరావు స్నేహితుడు వామనరావు.

"అదేరా. ఈ సమస్యని గట్టెక్కించు.''

"అయితే మీ అల్లుడి వీక్‌నెస్ కావాలి.''

"పొగిడితే ఏ పనైనా చేసిపెడతాడు అని అమ్మాయి చెప్పింది'' అన్నాడు రాఘవరావు.

"చాలు. ఇక నేను నడుపుతా కతను'' అన్నాడు వామనరావు సిగరెట్ వెలిగిస్తూ.

***

"రాఘవరావు ఉన్నాడా?'' అంటూ వచ్చాడు వామనరావు.

"లేరండి. చెప్పండి ఏం కావాలి?'' అడిగాడు ముకుందం.

"అల్లుడుగారున్నారా? ఏం లేదు బాబూ. మీ మామగారు పదివేలు తీసుకున్నాడు. ఈరోజు ఇస్తానన్నాడు. ఇవ్వలేదు. ఎలాగు మీ మామగారి ఆస్తి మీదే కాబట్టి మీరు సర్దితే ఈసారికి...''

"మామగారికి అప్పులున్నాయా? ఎప్పుడూ చెప్పలేదు!'' ఉలిక్కి పడ్డాడు ముకుందం.

"మీలాంటి మంచి అల్లుడు దొరకడం మీ మామగారి అదృష్టం. మీలాంటి మంచి వారుండడం భూమి చేసుకున్న అదృష్టం. ఆ పదివేలు సర్దితే'' అన్నాడు వామనరావు.

"సర్లెండి ఐదువేలు తీసుకోండి. మామగారి దగ్గర తర్వాతే తీసుకుంటా'' అంటూ ఐదువేలు ఇచ్చాడు ముకుందం.

అలా రోజుకొకరు మామగారి స్నేహితుడంటూ ముకుందాన్ని పొగిడి డబ్బులు పట్టుకుపోతున్నారు.

అలా ముకుందం డబ్బు ఏభై వేలు దాకా బయటకి పోయింది.

ఒక రోజూ లెక్కలు చూసుకొని బాబోయ్ మామగారు నాకే ఎసరు పెడుతున్నాడు. 'ఏభై వేలా' అని గుండె పట్టుకున్నాడు ఐదు పైసల ఖర్చుకి ఏభైసార్లు ఆలోచించే ముకుందం.

ఇక బిచాణా ఎత్తెయ్యాలని నిర్ణయించుకున్నాడు.

***

"మామగారు నేను బయలుదేరుతున్నా.''

"అప్పుడే తొందర ఏమొచ్చింది? ఇంకో నాలుగు రోజులుండండి.''

"లేదండి. స్కూల్లో పరీక్షలు. అసలే




సి.ఎం.గారు ఆకస్మిక తనిఖీలకు అధికార్లని పంపుతున్నాడు.''

"అయినా మీ హెడ్‌మాస్టర్ మేనేజ్ చేస్తాడు కదా!''

"రోజులన్నీ ఒక్కలా ఉండవు కదా!'' బట్టలు సర్దుకొని బయలుదేరడానికి కంగారు పడుతున్నాడు.

"అల్లుడుగారూ! కొంచెం పులిహోర తిని వెళ్లండి'' అంది ముకుందం అత్తగారు.

"పులిహోర తినే సమయమా? మామగారి అప్పులు 'పులి'లా తరుముతున్నాయి. ఇన్ని అప్పులా? ఒక్క పిల్ల, ఆస్తి అని సంబరపడ్డాను. ఇంక ఒక్క క్షణం కూడా ఉండను'' అంటూ పలాయనం చిత్తగించాడు ముకుందం.



***

"హమ్మయ్య మొత్తానికి నా అల్లుడి సమస్య పరిష్కరించావు'' హాయిగా ఊపిరి పీల్చాడు రాఘవరావు.

"వామనరావా? మజాకా?''

"ఆ ఏభై వేలు ఏం చేస్తున్నావు?'' అడిగాడు వామనరావు.

"పిల్లకి నెక్లెస్, అల్లుడుగారికి సూట్ కొంటాను. మన నాటకం కొన్నాళ్లపాటు వాళ్లకి తెలియక పోవడం మంచిది' అన్నాడు రాఘవరావు, వామనరావు దగ్గర ఏభైవేలు తీసుకొని.

ఇలా మాట్లాడుకుంటుండగా వామనరావు భార్య వచ్చింది.

"ఏమిటి సంగతి?''

"అల్లుడు వచ్చాడండి.''

"మన అల్లుడు ఎందుకు వచ్చాడు? ఇప్పుడే ఒక అల్లుడి సమస్య పరిష్కరించా'' అన్నాడు వామనరావు సిగరెట్ వెలిగిస్తూ.

"పండగట'' చెప్పింది వామనరావు భార్య.

"ఏం పండుగ?''

"కార్తవీర్య జయంతిట'' చెప్పింది వామరావు భార్య.

"ఆ!'' అంటూ అవాక్కయిపోయాడు వామనరావు.

★

